సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 3 । జూన్ । 2023



వైద్యసేవల్లో అలసత్వం వద్దు

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిని శుక్రవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ మొగిలి వీరాస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవల తీరు అడిగి తెలుసుకున్నారు. 8లో ▸



పశు బీమా.. రైతుకు ధీమా

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న పశు బీమా పథకంతో రైతు ధీమాగా ఉండవచ్చని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. 8లో ▸



అరటి ధరలు తగ్గుముఖం

వ్యాపారుల మాయాజాలం వల్ల అరటి ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏడాది ప్రారంభంలో ఆశాజనకంగా ఉన్న ధరలు ఒక్కసారిగా తగ్గాయి. 8లో ▸

న్యూస్‌రీల్

సీఎం సహాయ నిధితో తోడ్పాటు



బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి జగనన్న ప్రభుత్వం ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకుకు చెందిన వి.సుధాకర్‌కు వైద్యఖర్చుల నిమిత్తం శుక్రవారం మంత్రి కారుమూరి రూ.3.50 లక్షలు చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదవర్గాలకు 2వేలకు పైగా వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు సుద్దుల పాండు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్ర, కర్రి కాశీరెడ్డి, సప్పా బలరామకృష్ణ, కుడుపూడి చంద్రరావు పాల్గొన్నారు.

నేడు స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ కమిటీ సమావేశాలు ఈనెల 3న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహిస్తామని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

సాక్షి, భీమవరం: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 45 పరీక్షాకేంద్రాల్లో తెలుగు పరీక్ష నిర్వహించగా 70 శాతం విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ చెప్పారు. 3,092 మంది విద్యార్థులకు 2,167 మంది హాజరయ్యారన్నారు. 21 పరీక్షాకేంద్రాల్లో స్క్వాడ్, మూడు కేంద్రాల్లో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్, రెండు కేంద్రాల్లో డీఈవో తనిఖీలు చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వెంకటరమణ చెప్పారు.

బాలలను పనిలో పెట్టుకోకూడదు



పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ రవిప్రకాష్

నరసాపురం: బాలలను పనుల్లో పెట్టుకోకూడదని ఎస్పీ యు.రవిప్రకాష్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని వాసవీ కల్యాణమండపంలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు షాపుల్లో పనిచేస్తున్న పిల్లలను, బడికి వెళ్లకుండా వీధుల్లో తిరుగుతున్న సుమారు 40 పిల్లలను పోలీసు శాఖ గుర్తించి, వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పిల్లలతో పనులు చేయించినా, పిల్లలను పనుల్లో పెట్టుకున్నా కార్మిక శాఖ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. వీధి బాలలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో పోలీసు శాఖ ఈ కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. చదువులు చెప్పించడం ద్వారా పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయగలమని చెప్పారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కార్మిక శాఖ అధికారి జీవీ ఆర్ శర్మ, డీఎస్పీ కె.రవిమనోహరాచారి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

12న అప్రెంటీస్ మేళా

ఉండి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో పీఎం నేషనల్ అప్రెంటిషిప్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ.శ్రీనివాసరాజు శుక్రవారం తెలిపారు. అప్రెంటీస్ కోసం ఎదురు చూస్తున్న వారికి ఇదో చక్కని అవకాశమని అన్నారు. జిల్లాలోని 2 ప్రభుత్వ, 16 ప్రైవేటు ఐటీఐల్లో మొదటి విడత అడ్మిషన్ల కోసం ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అవకాశం ఉందని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ.శ్రీనివాసరాజు తెలిపారు. ఈ నెల 6 లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని లేకపోతే కౌన్సెలింగ్‌కు అనర్హులన్నారు.

భానుడి భగభగలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45 డిగ్రీల చేరువకు ఉష్ణోగ్రతలు
- తీవ్రమైన వడగాలులు
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి
- ఇరగవరం, ఆగిరిపల్లి, టి.నరసాపురంలో అత్యధిక ఉష్ణోగ్రతలు

ఏలూరు(మెట్రో): భానుడి భగభగలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలను అల్లాడిస్తున్నాయి. రెండు జిల్లాల వ్యాప్తంగా శుక్రవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో బయటకు రావడానికి జంకుతున్నారు. గత రెండు రోజులుగా 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణంగా జూన్ మొదటి వారంలో వాతావరణం చల్లబడుతుంది. కానీ ఈసారి ఎండవేడి, వేడిగాలులు తగ్గలేదు. మరో రెండు రోజులు పాటు ఇదే పరిస్థితి ఉంటుందని విపత్తుల నిర్వహణ శాఖాధికారులు పేర్కొనడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాటికి వేడిగాలులు తోడవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఇప్పటికే విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ జిల్లా కలెక్టర్‌లు ప్రసన్న వెంకటేష్, ప్రశాంతిలను అప్రమత్తంచేశారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, బయటకు వచ్చినప్పటికీ జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని త్వరగా తాకుతాయని భావించినప్పటికీ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు చూస్తేంటే మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎండ వేడిని మరికొద్ది రోజులు భరించడానికి ప్రజలు సిద్ధంగా ఉండాల్సిందేనని అధికారులు హెచ్చరిస్తున్నారు.



ఏలూరులో ఎండ వేడిమికి నిర్మానుష్యంగా మారిన జ్యూట్ మిల్లు సెంటర్



చర్మ సమస్యలు రావొచ్చు



తీవ్ర ఎండ వేడిమికి వడదెబ్బతోపాటు, చర్మ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముంది. ప్రస్తుత ఎండలకు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. ఫంగల్ ఇన్ఫెక్షన్‌లు సైతం ఏర్పడుతాయి. వేసవిలో సమస్యలు మరింత అధికంగా ఉంటాయి. ఏది ఏమైనా చర్మ సంరక్షణ, వడదెబ్బ తగలకుండా కనీస జాగ్రత్తలు తీసుకోవాలి.

– బంకా రవికుమార్, ప్రముఖ వైద్యుడు

జాగ్రత్తలు పాటించాల్సిందే..

తరచూ పనులపై బయటకు తిరిగే వారు జాగ్రత్తలు పాటించాలని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎండ వేడి అధికంగా ఉండటంతో వడగాలులకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు. అలాగే చర్మ వ్యాధులు రావచ్చని హెచ్చరిస్తున్నారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఉంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవచ్చని పేర్కొంటున్నారు.

అత్యధికంగా 44.8 డిగ్రీలు నమోదు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అత్యధికంగా ఏలూరు జిల్లాలో టి.నరసాపురం మండలం, ఆగిరిపల్లి మండలాల్లో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇరగవరం మండలంలో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి జిల్లాలో శని, ఆదివారాల్లోనూ ఇదే రకమైన ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖాధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

కుకునూరు, వేలేరుపాడు ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

ఏలూరు జిల్లాలో విలీన మండలాలైన కుకునూరు మండలంలో శనివారం 46.5 డిగ్రీలతో పాటుగా వేడిగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో, వేలేరుపాడు మండలంలో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కానున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని చెప్పారు.



పశ్చిమగోదావరి జిల్లా

మండలం	శుక్రవారం ఉష్ణోగ్రత	శనివారం ఉష్ణోగ్రత (అంచనా)
ఆచంట	39.2	40.7
ఆకివీడు	40.6	42.3
అత్తిలి	41.3	41.9
భీమవరం	41.2	39.0
ఇరగవరం	43.1	41.9
కాళ్ల	38.9	40.6
మొగల్తూరు	40.5	36.1
నరసాపురం	40.1	37.0
పాలకోడేరు	41.3	41.0
పాలకొల్లు	41.9	39.8
పెంటపాడు	42.3	42.4
పెనుగొండ	42.7	41.5
పెనుమంట్ర	40.6	41.6
పోడూరు	42.2	40.4
తాడేపల్లిగూడెం	41.4	42.5
తణుకు	43.1	42.3
ఉండి	41.3	41.8
వీరవాసరం	41.3	40.6
యలమంచిలి	41.5	39.0

రీ సర్వేతో మంచి ఫలితాలు సాధించాలి

కలెక్టర్ పి.ప్రశాంతి

కాళ్ల: రెండో దశ రీ సర్వే పనులు వేగవంతం చేసి మంచి ఫలితాలు సాధించాలని కలెక్టరు పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాళ్ల మండలం పెదఅమిరం గ్రామ సచివాలయంలో జక్కరం, కోపల్లె , పెదఅమిరం గ్రామాల రీ సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ పనులను పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రీ సర్వే పనులు బాగా జరుగుతున్నాయని, సంబంధిత సిబ్బంది కలిసికట్టుగా పని చేసి త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. మొదటి దశలో రీ సర్వే జిల్లాలోని 16 గ్రామాలలో విజయవంతంగా పూర్తి చేసుకున్నామని, ఇదే స్ఫూర్తితో రెండో దశ రీ సర్వే పనులు మిగిలిన అన్ని గ్రామాలలో పూర్తి చేయాలని సూచించారు. సర్వే జరుగుతున్న సమయంలో ప్రతి రైతును, భూ యజమానిని భూమి వద్దకు పిలిచి సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే ఆఫ్ ఇండియా నుంచి 45 గ్రామాల భూమికి సంబంధించిన మ్యాపులు వచ్చాయని, మిగిలిన మ్యాపులు త్వరలో రానున్నాయని స్పష్టం చేశారు. సర్వే లో డ్రోన్లు వినియోగిస్తున్నామని సిబ్బంది పూర్తి అవగాహన పొంది వేగవంతం చేయాలని తెలిపారు. పారదర్శకంగా రీ సర్వే జరగాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసి రాజు, సర్వే అధికారి కె.జాషువా, తహసీల్దారు టీపీ కృష్ణారావు, ఎంపీడీఓ జి.స్వాతి, మండల సర్వేయరు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నీటిపారుదల పనులపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాకు మంజూరైన రూ.20.78 కోట్లతో నీటిపారుదల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నీటిపారుదల పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కాలువలు, డ్రెయిన్లలో తూడు నిర్మూలన పనులను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. యలమంచిలి, నరసాపురం ప్రాంతాలలో బ్యాక్ వాటర్ కారణంగా సుమారు 3,500 ఎకరాల్లో ఒక పంట వేయలేకపోతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, బ్యాక్ వాటర్ ఇబ్బందిని తొలగించేందుకు అవసరమైన పనులకు సంబంధించి ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలన్నారు. మాధవాయపాలెం, దర్భరేవు షట్టర్ల రిపేర్లు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సమావేశంలో నీటి వనరుల అధికారి పి.నాగార్జునరావు, కెనాల్స్ ఈఈ దక్షిణామూర్తి, డీఈలు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు నాణ్యతతో చేయాలి

సాక్షి, భీమవరం: నాడు–నేడు పనులు పూర్తి చేయడంలో అలక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను హెచ్చరించారు. కలెక్టర్‌లో నాడు నేడు పనుల పురోగతిపై శుక్రవారం సమీక్షించారు. నాడు–నేడు పనులు ముందుకు సాగకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు నేడు పనులు పూర్తయ్యే వరకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. నాణ్యత లోపిస్తే చర్యలకు వెనకాడేది లేదన్నారు.

రాజగోపుర నిర్మాణంపై చెరుకువాడతో డీఎన్నార్ భేటీ



మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుతో కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్

కై కలూరు: పురాతన కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామి దేవాలయం వద్ద 108 అడుగుల మహారాజగోపురం నిర్మాణ విషయమై కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు నివాసంలో శుక్రవారం భేటీ అయ్యారు. చెరుకువాడ మంత్రిగా పనిచేసిన సమయంలో రూ.3 కోట్లు సొంత నిధులతో మహారాజగోపురాన్ని నిర్మిస్తామని కలిదిండిలో హామీ ఇచ్చారు. అదే విధంగా ఆలయ పునఃనిర్మాణ పనులపైనా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సందర్భంగా కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ పాతాళ భోగేశ్వర స్వామివారి మహారాజ గోపుర నిర్మాణం, ఆలయ పునఃనిర్మాణం అంశాలపై శ్రీరంగనాథరాజుతో చర్చించానన్నారు. దేవదాయ శాఖ డీఈఈ, స్తపతి, నిర్మాణంలో అనుభవం ఉన్న మేస్త్రీలను ఎమ్మెల్యే రంగనాథరాజు తీసుకుని ఈ నెల 15న కలిదిండి దేవాలయం వద్ద జరిగే సమావేశానికి విచ్చేస్తున్నారన్నారు. ఇప్పటికే గోపుర నమూనా తయారైందని చెప్పారు. సమావేశానికి భోగేశ్వర స్వామి భక్తులు, ఆలయ సిబ్బంది, గ్రామ ప్రముఖులు హాజరుకావాలని డీఎన్నార్ కోరారు.

బాలల రక్షణకు ప్రత్యేక చర్యలు



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): బాలలు, కౌమార బాలికలను గుర్తించి ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరంలోని కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షతన శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాలల రక్షణకు సంబంధిత శాఖలు కార్యాచరణ రూపొందించి తనిఖీలు నిర్వహించాలన్నారు. బాలలు, కౌమార కార్మికుల రక్షణ, పునరావాసంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. 14 ఏళ్ల లోపు చిన్నారులతో ఎవరైనా ఎక్కడైనా పనిచేయిస్తే చట్టపకారం శిక్షార్హులన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారు ఏదైనా పనిలో ఉన్నారా? ఇంటి వద్ద ఉన్నారా? ఆరా తీయడంతో పాటు వారిని తిరిగి చదువుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో ఆరు టీంలతో నేటి నుంచి జూన్ నెలాఖరు వరకు బాల కార్మికుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. బాల కార్మికులతో పనులు చేయిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలకార్మికులను స్కూళ్లలో చేర్పించాలి : విద్యా శాఖ, పోలీసులు, కార్మిక శాఖ, బాలల హక్కుల పరిరక్షణ సంస్థలు, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, వైద్య శాఖ తదితర శాఖల అధికారులతో బాలకార్మికులను గుర్తించి వారిని పాఠశాలలోకి చేర్పించాలని తెలిపారు. బాలల కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడితే వారికి ఉపాధి అవకాశాలు చూపించాలన్నారు. బాల కార్మికులు ఉండే ప్రదేశాలను గుర్తించి తరచూ తనిఖీలు నిర్వహించాలని ఎక్కువగా భిక్షాటన చేసే బాలలను రైల్వే స్టేషన్, ఆర్టీసి కాంప్లెక్స్‌లోను అలాగే హోటళ్లు, కిరాణాషాపులు, ఇటుక బట్టీలు, ప్యాకింగ్ ఇండస్ట్రీస్, ఆక్వా ఫీల్డ్, బేకరీ ఇండస్ట్రీస్, తదితర ప్రదేశాలలో పనిచేసే వారిని గుర్తించాలని తెలిపారు. బడిమానేసిన పిల్లల జాబితాను విద్యాశాఖ ద్వారా తెప్పించుకొని పిల్లలను తిరిగి పాఠశాలల్లో జాయిన్ చేసేలాగా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేయాలన్నారు. 9, 10 తరగతులు చదువుతూ మానేసిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులుగా పనిచేస్తున్నట్లుగా గుర్తిస్తే ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, అడిషనల్ ఎస్పీ ఎటీవీ రవి కుమార్, భీమవరం ఆర్డీవో దాసిరాజు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రబికా రాణి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సీహెచ్.సూర్య చక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో పడకల సంఖ్య పెంపు

- 13 పీహెచ్‌సీలకు అదనంగా 6 పడకలు
- రూ.1.28 కోట్ల నిధులు మంజూరు

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేశారు. వైద్య సేవలు మారుమూల గ్రామాలకు సైతం అందాలనే లక్ష్యంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పూర్తిస్థాయిలో వైద్యులను, సిబ్బందిను నియమించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవలతో పాటు డెలివరీలు కూడా జరిగేలా చర్యలు తీసుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని అభివృద్ధి చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించడానికి అదనపు పడకలు, బ్లాక్ ప్లబిక్ యూనిట్స్‌ను మంజూరు చేశారు. పట్టణాలకు దూరంగా ఉన్న మారుమూల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అదనంగా ఆరు పడకల చొప్పున మంజూరు చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనంపై మొదటి అంతస్తులో ఆరు పడకలు ఉండేలా నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. బ్లాక్ పబ్లిక్ యూనిట్స్ కూడా మంజూరు చేశారు.



ఆరు పడకలు మంజూరైన భీమవరం మండలం తుందుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

రూ 1.28 కోట్లు మంజూరు

జిల్లాలో 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అదనంగా ఆరు పడకల చొప్పున మంజూరు చేస్తూ నిర్మాణం కోసం రూ.1.28 కోట్లను మంజూరు చేశారు. ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆరు పడకల కోసం రూ.9.83 లక్షలు ఖర్చు చేయనున్నారు.

5 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ మంజూరు

జిల్లాలోని 5 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్‌ను(పలు వైద్య పరీక్షలు చేసే యూనిట్)ప్రభుత్వం మంజూరు చేసింది. 15 ఆర్థిక సంఘం నిధులు రూ.2.50 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.50 లక్షలు వినియోగిస్తారు.

ఆరు పడకలు మంజూరైన పీహెచ్‌సీలు

తుందుర్రు, వీఆర్‌గూడెం, వల్లూరు, మంచిలి, ఉండి, ఆలమూరు, యలమంచిలి, పెనుమంట్ర, పెంటపాడు, సిద్ధాంతం, మార్టేరు, తూర్పు తాళ్లు, యండగండి,

బ్లాక్ పబ్లిక్ యూనిట్స్ : నర్సాపురం మండలం ఎల్‌బీచర్ల, యలమంచిలి మండలం దొడ్డిపట్ల, ఉండి మండలం యండగండి, పోడూరు మండలం పోడూరు, అత్తిలి మండలం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

వేగంగా నిర్మాణాలు జరిగేలా చర్యలు



ప్రభుత్వం జిల్లాలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆరు పడకలు చొప్పున, 5 బ్లాక్ పబ్లిక్ యూనిట్లను మంజూరు చేసింది. వాటికి సంబంధించి నిర్మాణాలు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకు మంజూరైన 276 హెల్త్ క్లినిక్‌ల్లో ఇంత వరకు 91 క్లినిక్‌లు పూర్తయ్యాయి. వాటిని సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకొస్తాం. మిగిలిన క్లినిక్‌లు సెప్టెంబర్ నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం.

– పి.ప్రశాంతి, కలెక్టర్, పశ్చిమగోదావరి

క్లుప్తంగా

గోవుల తరలింపును అడ్డుకున్న హనుమాన్ సేన



నూజివీడులో పట్టుబడిన గోవులు

నూజివీడు: మండలంలోని తుక్కులూరులో గురువారం రాత్రి మూడు లారీల్లో తరలిస్తున్న గోవులను హనుమాన్‌సేన కార్యకర్తలు పట్టుకొని రూరల్ పోలీసులకు అప్పగించారు. కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు వ్యాన్లలో గోవులను తరలిస్తుండగా తుక్కులూరులోని వై జంక్షన్ వద్ద హనుమాన్ సేన కార్యకర్తలు అడ్డుకుని పోలీసులకు సమాచారమందించారు. మరో వాహనం అతివేగంగా వెళ్లడంతో వీరి భారి నుంచి తప్పించుకుంది. ఈ మేరకు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ కేసు నమోదు చేశారు. మూడు వాహనాల్లో ఉన్న 139 ఆవులను విడిపించి తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఉన్న గో సంరక్షణ శాలకు తరలించారు. ఈ కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఇలా గోవులతో వాహనాలను పట్టుకోవడం వారం రోజుల్లో ఇది రెండోసారి కావడం గమనర్హం.

పశు బీమా.. రైతులకు ధీమా

- పాడి పశువులు, జీవాల నష్టం నుంచి రక్షణ
- 5 గేదెలు, 50 జీవాల బీమాకు అవకాశం

చింతలపూడి: పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పశు బీమా పథకం ప్రవేశపెట్టింది. గతంలో ఉన్న వైఎస్సార్ పశునష్ట పరిహార పథకం స్థానంలో దీన్ని అమలు చేస్తున్నారు. పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు చనిపోతే కలిగే నష్టం నుంచి రైతులకు, పశువుల పెంపకందార్లకు తగిన రక్షణ కల్పించేందుకు ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారని పశుసంవర్ధకశాఖ ఏడీఏ జె.లింగయ్య తెలిపారు. ఈ పథకంలో గరిష్టంగా ఒక కుటుంబానికి 5 గేదెలు, 50 గొర్రెలు, మేకలు, పందులకు బీమా చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

ప్రీమియం ఇలా..

పశు బీమా పథకంలో రూ.30 వేలు ఖరీదు చేసే ఆవు లేదా గేదెకు మూడేళ్లకు కలిపి 6.4 శాతం అంటే రూ.1,920 ప్రీమియంగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.384, ఏపీఎల్ (ఓసీ)లు రూ.960 లబ్ధిదారుని వాటాగా చెల్లించాలి. రూ.15 వేలు ఖరీదు చేసే ఆవు లేదా గేదెకు ప్రీమియం 6.4 శాతం అంటే రూ.960గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్‌లు రూ.192, ఏపీఎల్ (ఓసీ)లు రూ.480 చెల్లించాలి.

గొర్రెలు, మేకలు, పందులకు..

రూ.6 వేలు ఖరీదు చేసే గొర్రెలు, మేకలు, పందులకు ప్రీమియం ఏడాదికి 3 శాతం అంటే రూ.180గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్‌లు రూ.36, ఏపీఎల్ (ఓసీ)లు రూ.90 లబ్ధిదారుని వాటాగా చెల్లించాలి. ఈ ప్రీమియం రెండేళ్లకయితే 4.5 శాతం రూ.270గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్‌లు రూ.54, ఏపీఎల్ (ఓసీ)లు రూ.135 చెల్లించాలి. ఈ ప్రీమియం మూడేళ్లకు 6.25 శాతం అంటే రూ.375గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్‌లు రూ.75, ఏపీఎల్ (ఓసీ)లు రూ.187.50 లబ్ధిదారుల వాటాగా చెల్లించాలి. సబ్సిడీ పోను మిగిలిన ప్రీమియం మొత్తం ప్రభుత్వమే భరిస్తుంది.





జె.లింగయ్య, ఏడిఏ, పశుసంవర్ధక శాఖ

ముందస్తు ఒప్పందం చేయాలి

బీమా పాలసీ అమలులో ఉండగానే పాడి పశువును విక్రయించడం లేదా మరొకరికి అప్పగించడం చేస్తే పాలసీ పూర్తయ్యే గడువులోగా లబ్ధిదారునికి ఉండే అధికారాన్ని పాడి పశువు కొత్త యజమానికి బదలాయించాల్సి ఉంటుంది. దీనిని అనుసరించి బీమా కంపెనీతో ముందుగానే ఒప్పందం చేసుకోవాలి.

క్లెయిమ్‌ల పరిష్కారం ఇలా..

లబ్ధిదారునికి క్లెయిమ్‌లు చెల్లించాల్సిన సందర్భంలో అవసరమైన పత్రాలను అందజేసిన గడువులోగా బీమా మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. క్లెయిమ్‌ల కోసం అందజేయాల్సిన పత్రాలు, వివరాలను ముందుగానే పాలసీదారునికి ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు అందజేయాల్సి ఉంటుంది.

వైద్యసేవల్లో అలసత్వం వద్దు

డీసీహెచ్‌ఎస్ వీరాస్వామి

తణుకు అర్బన్: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో అలసత్వం వద్దని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మొగిలి వీరాస్వామి అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విభాగానికి ప్రభుత్వం ఎనలేని వనరులు కల్పిస్తోందని, ముఖ్యంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన వైద్యాన్నీ ఉచితంగా అందిస్తోందని వివరించారు. పేదలకు ఉచిత వైద్యసేవలు సత్వరమే అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రస్తుత బదిలీల అనంతరం ప్రతి ప్రభుత్వాసుపత్రికి అవసరమైన వైద్యులు, సిబ్బంది భర్తీకి ఉన్నతాధికారులు కృషి చేస్తున్నట్టు చెప్పారు.

సూపరింటెండెంట్ శివప్రసాద్‌పై విచారణ

ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి స్పందించి తణుకు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివప్రసాద్‌పై విచారణకు ఆదేశించారని డీసీహెచ్‌ఎస్ వీరాస్వామి తెలిపారు. ఒక శస్త్రచికిత్సకు సంబంధించి వైద్యసేవలు అందలేదని బాధితులు పత్రికలకు ఇచ్చిన కథనం నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణకు ప్రత్యేక కమిటీని నియమించామని వివరించారు. కమిటీ ఇచ్చిన నివేదికను అనుసరించి తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు. ముందుగా ఆస్పత్రిలోని వైద్యవర్గాల అటెండెన్స్, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, ఏఆర్‌టీ సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



తణుకు ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న వీరాస్వామి

వడదెబ్బతో జర జాగ్రత్త

ఏలూరు టౌన్: ప్రస్తుత వడగాల్పుల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని రెడ్‌క్రాస్ వలంటీర్లు అవగాహన కల్పిస్తున్నారు. ఏలూరు ఆర్‌ఆర్ పేట, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంతంలో శుక్రవారం ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కరపత్రాలతోపాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ వి.నాగరాజు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు వడదెబ్బ నుంచి రక్షణ పొందేందుకు జాగ్రత్తలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. బయటకొస్తే గొడుగు లేదా టోపీ ధరించాలని, తరచు మంచినీరు తాగుతూ ఉండాలని, కొబ్బరినీరు, మజ్జిగ, చెరుకు రసం, ఓఆర్‌ఎస్ వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వలంటీర్లు ఎ.సూర్యనారాయణ, వి.నాగరాజు, కె.శ్రీనివాస్, టి.అనిల్ తదితరులు ఉన్నారు.



ఆర్‌ఆర్‌పేటలో వడదెబ్బ జాగ్రత్తలు సూచించే కరపత్రం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ వలంటీర్లు

బాలిక అదృశ్యంపై కేసు

ఉండి: బాలిక(17) అదృశ్యంపై ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 1వ తేదీ ఉదయం నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు.

ప్రాజెక్టులో చోరీకి గురైన డ్రిఫ్టర్ స్వాధీనం



హేమంత్ రాల్‌ను అరెస్టు చేసి డ్రిఫ్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలవరం ఎస్సై పవన్‌కుమార్

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో చోరీకి గురైన డ్రిఫ్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. గత నెల 28న చోరీకి గురైన ఈ యంత్రాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకుని ముద్దాయిని కోర్టుకు హాజరుపరిచామ న్నారు. ప్రాజెక్టు పనుల్లో మేఘ ఇంజినీరింగ్ కంపెనీకి ఏజెంట్‌గా వ్యవహరిస్తోన్న బోమర్ మెషీన్ ఆపరేటర్ హేమంత్ రాల్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వాంగ్మూలంపై పోయిన డ్రిఫ్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. హేమంత్ రాల్ రెండేళ్లుగా పోలవరం ప్రాజెక్టులో పనిచేస్తున్నట్టు తెలిపారు. అతని స్వస్థలం ఒరిస్సా అని, గతంలో ఇతను వేరే రాష్ట్రాల్లో పనిచేసిన వ్యక్తులతో అక్రమ వ్యాపారం చేసేవాడని చెప్పారు. ఈ కోవలో కలకత్తా నుంచి కొందర్ని రప్పించి వారి సాయంతో రూ.45 లక్షలు విలువైన డ్రిఫ్టర్ ను బూమర్ మెషీన్ నుంచి వేరుచేసి గత నెల 28న సాయంత్రం ప్రాజెక్టు సరిహద్దులు దాటించినట్టు వివరించారు. కోల్‌కత్తాకు తరలించేందుకు సిద్ధమవుతున్న సమయంలో వీరిని పట్టుకున్నామని తెలిపారు. ముద్దాయిని జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరు పరిచామని పేర్కొన్నారు.

వరాల వెంకన్నకు గరుడవాహన సేవ

అత్తిలి : మండలంలోని ఈడూరు గ్రామంలోని వరాల వెంకటేశ్వరస్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడవాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం బస్వా శ్రీనివాసు, విజయలక్ష్మి దంపతులచే సుప్రభాత సేవ, మేలుకొలుపు, తోమాలసేవ చేశారు. అల్లూరి సీతారామచంద్రరాజు, విశాలాక్షి దంపతుల కుమారుడు సాయిహర్షచే సుదర్శన హోమం నిర్వహించారు. రాత్రి చోరోత్సవం అనంతరం గరుడవాహనంపై స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పెన్మెత్స ప్రభాకర కోటిరామలింగరాజు, ఈఓ పిల్లి సూర్యనారాయణ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



గరుడవాహనంపై కొలువైన వరాల వెంకన్న

9న పాలకొల్లులో జాబ్ మేళా

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 9వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 89856 44389లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గ్యాస్ లీకై వ్యక్తికి గాయాలు



గాయపడిన శ్రీనివాస్

ఆకివీడు: తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. స్థానిక మెడిప్లస్ టర్నింగ్‌లోని హైడాక్టర్ వీధిలో ఒక అపార్టుమెంట్ రెండో ఫ్లోర్‌లో నివశిస్తున్న గురిపురం శ్రీనివాస్ ఇంట్లో గ్యాస్ లీకైంది. టీ కాసుకునేందుకు శ్రీనివాస్ భార్య స్టౌవ్ వెలిగించగా మంటలు చెలరేగాయి. శ్రీనివాస్ మంటల్ని అదుపు చేసేందుకు గ్యాస్ బండను పక్కకు లాగే ప్రయత్నంలో గాయాలపాలయ్యాడు. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి తెలియజేశారు. దీంతో ఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటల్ని అదుపు చేశారు. గాయాలపాలైన శ్రీనివాస్‌ను స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనలో సుమారు రూ.5 వేలు నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికార వై.నాగేశ్వరరావు తెలిపారు.

దంపతులకు తీవ్రగాయాలు

నూజివీడు: మండలంలోని బోర్వంచ పంచాయతీ శివారు అమృతనగర్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. నూజివీడు పట్టణానికి చెందిన వెంకటేశ్వరరావు (63), రమాదేవి (58) టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తుండగా బస్సు ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ కింద పడటంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఏరియా ఆసుపత్రికి తరలించి, అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి ఫిర్యాదు అందాల్సి ఉందని రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తెలిపారు.

హైస్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

ఏడాదిలో ఐదుగురు

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ హెడ్మాస్టర్ గెడా జగ్గారావును సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని డీవైఈఓ రామన్నదొర తెలిపారు. జగ్గారావుకు సస్పెన్షన్ ఉత్తర్వులు అందజేశామన్నారు. మార్చి 16న జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఫ్యాన్, ట్యూబ్ లైటు పాడు చేశారనే కారణంతో విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. దీనికి సంబంధించి ఉన్నతాధికారులు, బాలల హక్కుల కమిషన్ కూడా విచారణ చేశారు. బాలల హక్కుల ఉల్లంఘన నిర్ధారణ కావడంతో వారం రోజుల క్రితం సీహెచ్ సుధాకర్‌రెడ్డి, విజయప్రకాష్ అనే ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. తాజాగా హెచ్‌ఎం గెడా జగ్గారావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏడాదిలో ఐదుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఏడాదిలో ఐదుగురు ఉపాధ్యాయులు సస్పెన్షన్‌కు గురయ్యారు. గతంలో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులు సస్పెన్షన్‌కు గురికాగా, తాజాగా హెచ్‌ఎంతో సహా మరో ఇద్దరు ఉపాధ్యాయులు సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో ఏడాదిలో సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయులు సంఖ్య ఐదుకు చేరింది. ఇదిలా ఉంటే ఇదే ఘటనకు సంబంధించి ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

సైబర్ నేరగాళ్ల వలలో యువకుడు

యలమంచిలి: సైబర్ నేరగాళ్ల వలలో మరో బాధితుడు చిక్కుకున్నాడు. ఏనుగువానిలంక గ్రామానికి చెందిన వినుకొండ ప్రవీణ్ వాట్సాప్ నెంబర్‌కు ఈ నెల 29 తేదీన ఒక లింక్ వచ్చింది. లింక్‌లోని వీడియో చూస్తే రూ.50 డబ్బు వస్తుందని ఉంది. దీంతో ప్రవీణ్ లింక్ ఓపెన్ చేయగా రూ.50 వచ్చింది. తరువాత రూ.2000 డబ్బులు వేస్తే రూ.2800 వస్తాయని చెప్పారు. ఆ మేరకు ప్రవీణ్‌కు సెల్‌కు యూజర్ నేమ్, వెబ్‌సైట్ లింకు వచ్చింది. ఆ విధంగా చాట్ చేస్తూ ప్రవీణ్ ఖాతాలోని రూ.5.85 లక్షలు ఖాళీ చేశారు. డబ్బులన్నీ వెళ్లిపోయాక మోసపోయానని తెలుసుకున్న ప్రవీణ్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తెలిపారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

బుట్టాయగూడెం: ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆశ ఆదేశించారు. బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెం ప్రభుత్వాసుపత్రిలో ఆమె శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ల్యాబ్‌లో చేస్తున్న పరీక్షలు, రికార్డులను, ఫ్రైడే డ్రైడే కార్యక్రమం, గ్రామంలోని పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆశ మాట్లాడుతూ జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దోమలు వృద్ధిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపైనా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మరో వారం రోజుల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు తప్పనిసరిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన దోమ తెరలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో నిర్వహించిన మలేరియా నివారణ కార్యక్రమంలో పాల్గొన్నారు. డీఎంఓ ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజీవ్, స్థానిక డాక్టర్ ప్రియదర్శిని, మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.పెద్దిరాజు, వాసంతి, బాలాజీ, దుర్గా ప్రసాద్, ఎల్‌టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అంతర్వేదిగూడెంలో పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఆశ

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి



రాఘువేంద్రరావు (ఫైల్)

పెదపాడు : వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు, మహిళ మృతి చెందారు. పెదపాడు ఎస్సై కృష్ణా చల్లా తెలిపిన వివరాలు ప్రకారం.. పెదపాడు మండలం వేంపాడు గ్రామానికి చెందిన మరీదు దశరదరామయ్య కుమారుడు రాఘవేంద్రరావు (16) ప్రమాదవశాస్తు విద్యుత్ షాకుకు గురయ్యాడు. దీంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత నెల 27న ఉదయం ఏలూరులోని అమీనాపేటకు చెందిన మద్దాల సుధారాణి (36) ఏలూరు నుంచి గన్నవరం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాస్తు పెదపాడు మండలం తాళ్లమూడి గ్రామంలో బైక్‌తోపాటు కింద పడిపోయింది. తల డివైడర్‌కు ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమె విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఈనెల 1న రాత్రి మృతిచెందింది. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని పెదపాడు ఎస్సై కృష్ణా చల్లా తెలిపారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు

ముసునూరు: మహిళపై లైంగిక దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. ముసునూరు మండలం గుళ్లపూడి శివారు గుడిపాడుకు చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన రాజబోయిన నాగరాజు (35) బుధవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో అత్యాచారయత్నం చేశాడన్నారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో గొంతు పట్టుకుని, అరిస్తే చంపేస్తానంటూ, బెదిరించాడని, ఈలోగా ఆమె కేకలు విన్న చుట్టుపక్కల ప్రజలు అక్కడికి చేరుకోవడంతో వారిని బలంగా నెట్టివేసి పారిపోయాడని పేర్కొన్నారు. బాధిత మహిళ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై కుటుంబరావు తెలిపారు.

అరటి ధరలు తగ్గుముఖం

- టన్ను ధర సగానికి పైగా పడిపోయిన వైనం
- 6 వేల హెక్టార్లకు పైగా అరటి సాగు
- టిష్యూ కల్చర్ అరటికి డిమాండ్

చింతలపూడి: వ్యాపారుల మాయాజాలంతో ప్రస్తుతం అరటి ధర టన్ను రూ.6 వేలు నుంచి రూ.7 వేల మధ్య పడిపోయింది. దీంతో రైతులు నష్టపోతున్నారు. ఏడాది ప్రారంభంలో అరటి టన్ను రూ.12 వేల నుంచి రూ.20 వేలకు విక్రయించిన రైతులు ప్రస్తుతం దిగజారిన ధర చూసి దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

ఎకరా సాగుకు రూ.2 లక్షలు

జిల్లాలో సుమారు 6 వేల హెక్టార్లకుపైగా అరటి పంట సాగు చేస్తున్నారు. ఇదికాక పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో కూడా మన రైతులు సుమారు వెయ్యి ఎకరాల్లో అరటి పంటను సాగు చేస్తున్నట్టు అంచనా. పిలక నాటిన నుంచి గెలలు వచ్చే వరకు రైతులకు ఎకరానికి కౌలుతో కలుపుకుని రూ.2 లక్షలు ఖర్చు అవుతుంది. అలాగే, అరటి కాయలను కోసి లోడింగ్ చేయడానికి టన్నుకు రూ.1,000 ఖర్చవుతుంది. అయితే ఈ ప్రాంతంలో ఎకరానికి 25 నుంచి 30 టన్నుల వరకు దిగుబడి సాధించే రైతులు ఉన్నారు. వీరంతా పతనమైన ధరతో నష్టపోతున్నామని వాపోతున్నారు.



మెట్ట ప్రాంతంలో ఎగుమతికి సిద్ధం చేస్తున్న అరటి గెలలు

నష్టాల నుంచి కోలుకోని రైతులు

జిల్లాలో పండించే టిష్యూకల్చర్ (పచ్చ అరటి) పంటకు విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కోదాడ, గుంటూరు, తెనాలి, మద్రాసు, మహారాష్ట్ర, కర్నాటక మార్కెట్లలో మంచి గిరాకీ ఉంది. పక్వానికి వచ్చిన తోటలను దళారులు ముందుగా పరిశీలించి గెలలకు సగటు ధర నిర్ణయిస్తారు. గతంలో కరోనా సమయంలో ఎగుమతులు లేక టన్ను కేవలం రూ.రెండున్నర వేలు నుంచి రూ.3 వేలకు అమ్ముడు పోవడంతో రైతులు నష్టపోయారు. ఆ నష్టాల నుంచి ఇంకా రైతులు కోలుకోలేదు.

గిట్టుబాటు ధర లేదు



"నేను 30 ఎకరాలకు పైగా అరటి పంట సాగు చేస్తున్నాను. ఎకరానికి రూ.2 లక్షలు పెట్టుబడి అవుతుంది. కరోనా ప్రభావంతో రెండేళ్ల సరైన ఎగుమతులు లేవు. ప్రజలు ఇళ్లకే పరిమితం అవ్వడంతో మార్కెట్లో అరటి పండ్లు కొనేవారు లేక ఎకరానికి రూ.లక్షకు పైగా నష్టపోయాం. గతేడాది నుంచి మళ్లీ మార్కెట్ కుదుట పడుతుందని అనుకుంటున్న సమయంలో గిట్టుబాటు ధర రావడం లేదు. అరటి రైతులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇచ్చి ఆదుకోవాలి. మెట్ట ప్రాంతంలో మార్కెట్ సౌకర్యం కల్పించి ప్రభుత్వం అరటి పంటకు పూర్తి బీమా సౌకర్యం కల్పించాలి.

– యర్రంశెట్టి రామకృష్ణారావు, రైతు, నామవరం

అరటి రైతులకు ప్రభుత్వం చేయూత



టిష్యూ కల్చర్ పండించే అరటి రైతులకు ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా హెక్టారుకు రూ.30 వేలు సబ్సిడీని అందిస్తోంది. అలాగే ప్లాస్టిక్ ట్రేలకు కూడా రూ.120 రాయితీ అందిస్తోంది. మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– ఎ.దుర్గేష్, ఏడీ, ఉద్యానశాఖ

స్వయం ఉపాధితోనే ఆర్థికాభివృద్ధి

తాడేపల్లిగూడెం రూరల్: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా ట్రయినీ డిప్యూటీ కలెక్టర్ అఖిల అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం మండల సమాఖ్య భవనంలో మహిళలతో ఆమె సమావేశం నిర్వహించారు. మహిళలు చిరు వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలని అఖిల సూచించారు. అనంతరం చినతాడేపల్లి గ్రామంలో అమూల్ పాల కేంద్రాన్ని, పీఎంఈజీపీ ద్వారా పిండి మిల్లు, జగ్గన్నపేటలో గొర్రెల పెంపకం, అప్పారావుపేటలో పెరటి కోళ్ల పెంపకం, మాధవరంలో ఫిష్ ఆంధ్ర, నవాబుపాలెం, ఆరుగొలను గ్రామాల్లో మహిళలు ఏర్పాటు చేసిన వివిధ యూనిట్లను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీపీఎం వెంకటేశ్వరరావు, ఏపీఎం జీవీకేడీఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైలు ట్రాక్‌పై మృతదేహం



తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం బాదంపూడి రైల్వే స్టేషన్ల మధ్య విశాఖ వైపునకు వెళ్లే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి (30) మృతదేహాన్ని గుర్తించినట్టు స్థానిక జీఆర్‌పీ ఎస్సై జి.శ్రీహరిబాబు శుక్రవారం తెలిపారు. ఉదయం 6.45కు ముందు రైలు నుంచి పడికాని, ఇతర ప్రమాదం వల్ల వ్యక్తి మరణించి ఉండొచ్చని చెప్పారు. మృతుడు నలుపురంగు కట్‌బనియన్, బ్లూకలర్ జీన్‌ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని, మృతుని వివరాలు తెలిస్తే సెల్ నెంబర్ 94906 17090కు తెలియచేయాలని కోరారు.

క్లుప్తంగా

మోదకొండమ్మ తల్లిని దర్శించుకున్న న్యాయమూర్తి ప్రకాశ్‌బాబు


అమ్మవారిని దర్శించుకుంటున్న జడ్జి ప్రకాశ్‌బాబు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని తాడేపల్లి గూడెం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కర్రి ప్రకాష్‌బాబు శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మోదమ్మకు న్యాయమూర్తి ప్రకాష్‌బాబు,అతని భార్య, కుమార్తెలు, ఇతర కుటుంబ సభ్యులు పసుపు, కుంకుమ సమర్పించారు. ఉత్సవ విగ్రహాన్ని తలపై మోశారు.అనంతరం న్యాయమూర్తి దంపతులతో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపించారు. గతంలో ప్రకాష్‌బాబు పాడేరు కోర్టులో న్యాయమూర్తిగా పనిచేశారు.ప్రకాష్‌బాబు దంపతులకు పాడేరులోని సీనియర్ న్యాయవాది బండారు వెంకటరమణ, పాడేరు ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడులు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, మోదమ్మ చిత్రపటంతో పాటు ప్రసాదం అందజేశారు.

బాలకనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


తాడేపల్లిగూడెం మండలం మోదుగ గుంట గ్రామంలో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగ గుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన బాలకనకదుర్గమ్మ ఆలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శనివారం ఉదయం 8.01 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి తెలిపారు. అనంతరం అన్నసమారాధన జరుగుతుందని, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటి సభ్యులు విజ్ఞప్తి చేశారు.

సైకిల్ మధుసూదనరావు...


సైకిల్‌పై వెళ్తున్న మధుసూధనరావు

తణుకు అర్బన్: ఈయన పేరు మంచెం మధుసూదనరావు. ప్రతిరోజూ సాయంత్రం గంటన్నరసేపు సుమారుగా 5 కిలోమీటర్లు మేర సైకిల్ తొక్కడం ఈయన దినచర్య. తణుకు సజ్జాపురంలో నివసిస్తున్న మధుసూదనరావు తణుకు మునిసిపాలిటీలో బిల్ కలెక్టరుగా పనిచేసి 4 ఏళ్ల క్రితమే పదవీ విరమణ చేశారు. ఇంట్లో రెండు ద్విచక్ర వాహనాలు ఉన్నప్పటికీ శారీరక శ్రమ ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రతి రోజూ తప్పనిసరిగా సజ్జాపుర వీధుల్లో సైకిల్‌పై రౌండ్లు కొడుతుంటారు. అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ సైకిల్ తొక్కడం వలనే ఫిట్‌గా ఉండడంతో పాటు ఉల్లాసంగా ఉంటుందని, సైకిల్ తొక్కని రోజున శారీరకంగా, మానసికంగాను ఇబ్బందిగా ఉంటుందని చెబుతున్నారు.

రైతుల ఖాతాలకు రూ.6.69 కోట్లు జమ

తాడేపల్లిగూడెం రూరల్: రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం కింద ఆరు కోట్ల 69లక్షల 18వేల 500 రూపాయలు మేర 12,167మంది రైతుల ఖాతాలకు జమ అయ్యాయని మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రైతు భరోసా కింద రూ.5,500లు , పీఎం కిసాన్ కింద రూ.2వేలు వెరసి 7,500రూపాయలు జమ అయినట్లు వివరించారు. ఏమైనా సమస్యలుంటే రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని ఏవో ఆర్‌ఎస్.ప్రసాద్ తెలిపారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి


రేలంగిలో వలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

ఇరగవరం: ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ చేరువ చేయడంలో వలంటీర్ల సేవలు ఎనలేనివని సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం అన్నారు. మండలంలోని రేలంగిలో సచివాలయల్లో పని చేస్తున్న 68 మంది వలంటీర్లకు శుక్రవారం పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కరోన సమయంలో వలంటీర్ల ప్రాణాలకి తెగించి సేవలు అందించారన్నారు. గ్రామంలో ఉన్న నాలుగు సచివాలయల్లో పనిచేస్తున్నా ప్రతి ఒక్క వలంటీర్ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఎంపీటీసీ మెట్ల కిన్నాయి, వడ్డే మార్కేండేయులు, చేబ్రోలు పెద్దిరాజు, నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు


గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు


తణుకు మహిళా గ్రంథాలయంలో విద్యార్థులకు అబాకస్ శిక్షణ ఇస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): వేసవి విజ్ఞాన తరగతులు ఆహ్లాదకరంగా శుక్రవారం పట్టణంలో గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు 25వ రోజు జన విజ్ఞాన వేదిక కన్వీనర్ ప్రత్తి వీరాస్వామిచే నీతి కథలు, ఆటపాటలు నేర్పించారు. విశ్రాంత ఎంఈఓ సాల్మన్‌రాజుచే స్పోకెన్ ఇంగ్లీషు, విశ్రాంత ఎల్ఐసీ ఉద్యోగి బాపయ్యశర్మచే చరిత్ర, ఎ.జనార్ధనరావు హిందీ, తెలుగు ఉపాధ్యాయులు మహాభట్టు లక్ష్మణరాజుచే తెలుగు పద్యాలు, సూక్తులు, లోకోక్తులు నేర్పించారు.

గ్రంథాలయాల్లో ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శుక్రవారం తణుకు పట్టణంలో బ్యాంక్ కాలనీలో గల పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, విద్యార్థులతో కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు రిసోర్సు పర్సన్ పీ త్రిపుర సుందరి ఆధ్వర్యంలో గణితంలో అబాకస్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం క్రాఫ్ట్ పేపర్‌తో బొమ్మలు తయారు చేసే విధానం, భగవద్గీత శ్లోకాలును నేర్పించడం, నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం ఇంగ్లీష్ పదాలకు అర్థాలు చెప్పించడం, చెస్ బిజినెస్, అంత్యాక్షరి వంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మీ, రీసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులతో తెలుగు గజిబిజి పదాలను చెప్పించడం, రాయించడంతో పాటు కథల పుస్తకాలు చదివించడం, యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు


బలుసులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి ఆలయం వద్ద అర్చకులచే విశేష పూజలు జరిగాయి. భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించారు. పలువురు భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొట్టు అంజిబాబు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పెంటపాడు: పెంటపాడు మండలంలో రెండు గ్రామాల్లో యుక్తవయస్సు రాకుండా ఇద్దరు బాలికలకు బాల్యవివాహాలు చేసుకుంటున్నారన్న సమాచారం మేరకు పెంటపాడు ఐసీడీఎస్ అధికారులు తక్షణం స్పందించారు. ఈ సందర్భంగా ఆకుతీగపాడులో గురు, శుక్రవారాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని, స్థానిక పోలీసులు, కమ్యూనిటీ పోలీసు, అంగన్‌వాడీ వర్కర్ల, ఆశా కార్యకర్తల సమక్షంలో ఆ గ్రామంలో వారికి కౌన్సెలింగ్ అందించారు. ఆ బాలికల తల్లిదండ్రులకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పెళ్లి కుదుర్చుకొని పెళ్లీడు వచ్చాక వివాహాలు చేసుకొనేలా ఒప్పంద పత్రం రాయించుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి


అధికారులతో హౌసింగ్‌పై సిబ్బందితో సమీక్షిస్తున్న డీపీవో, మండల ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు

పెంటపాడు: నవరత్నాలు - పేదలకు ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాలు ప్రజలకు నేరుగా చేరాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి జీవీకే మల్లికార్జునరావు కోరారు. హౌసింగ్ డే పురస్కరించుకొని ముదునూరు గ్రామ సచివాలయం వద్ద అధికారులకు ఆయన సమీక్షా సమావేశం ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు మండలంలో సాధించిన ప్రగతిపై గ్రామాల వారీగా సమీక్షించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మౌలికసదుపాయాల కల్పనలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రధానంగా హౌసింగ్ శాఖ సిబ్బంది నిత్యం సమీక్షించి రిపోర్టును తనకు అందించాలన్నారు. ప్రధానంగా పెంటపాడు మండలంలో 26 లే అవుట్‌ల్లో జగనన్న ఇళ్ల నిర్మాణం సాగుతోందని, ప్రత్తిపాడు, ముదునూరు, బి. కొండేపాడు గ్రామాల్లో ఇప్పటికే 90 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయని, పలు ప్రాంతాల్లో గృహప్రవేశాలు కూడా చేశారన్నారు. ఈ గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, రోడ్లు వంటి సౌకర్యాలను అధికారులు సమకూర్చే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ శాఖ అధికారులు, విద్యుత్ శాఖ ఏఈ పద్దరాజు, ఆయా సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై అవగాహన అవసరం


ఇరవరంలో చిరు ధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఇరగవరం: చిరు ధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎంపీడీవో పి శ్రీనివాస్ రావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, ప్రజలకు చిరుధాన్యాలు, మిల్లెట్స్ వినియోగం పై అవగాహన కల్పించారు. మనం రోజు తీసుకునే ఆహారంలో చిరు ధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. వాటి వల్ల ఎంతో ఉపయోగం ఉంది అన్నారు. గర్బిణులు,బాలింతలు, కిషోర్ బాలికలు, పిల్లలు తప్పని సరిగా చిరు ధాన్యాలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇటీవల కాలం చిరు ధాన్యాలు వినియోగం పెరిగిందన్నారు. రానున్న కాలంలో వాటి వినియోగం మరింత పెరగాలని దానికి అనుగుణంగా అధికారులు ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం తణుకు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఎసీడీపీవో ఆషా రోహిణి అంగన్ వాడి సిబ్బందితో ఎన్ని రకాలుగా చిరు ధాన్యాలు తీసుకోవచ్చు, తయారు చేసుకోవచ్చు అనే దాని పై స్టాల్ ఏర్పాటు చేసి అందరికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ మంగెన రామానాయుడు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, కాంతకుమారి, మాణిక్యంబ, నాగలక్ష్మీ, అధికారులు పాల్గొన్నారు.

యాత్రా స్పెషల్ బస్సులను సద్వినియోగం చేసుకోండి


ప్రయాణికులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో యాత్రా స్పెషల్ బస్సులను ప్రయాణీకులు, భక్తులు, యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి శుక్రవారం రాత్రి అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రా స్పెషల్ బస్సును పంపారు. మేనేజర్ మాట్లాడుతూ ఈ ఆధ్యాత్మిక యాత్ర నాలుగు రోజుల పాటు ఉంటుందని తెలిపారు. రెండోవ రోజు శ్రీ కాళహస్తీశ్వర స్వామి దర్శనం, కాణిపాకం వరసిద్ది వినాయక స్వామి దర్శనం, శ్రీపురం శ్రీలక్ష్మి అమ్మవారి గోల్డెన్ టెంపుల్ దర్శనం, అనంతరం మూడోవ రోజు అరుణాచలం చేరుకోవడంతో పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ జరుగుతోందని, అరుణాచలేశ్వర స్వామి దర్శనం, తిరుగు ప్రయాణంలో 5వ తేదీ ఉదయం తాడేపల్లిగూడెం చేరుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రయాణీకులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

గూడెం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.విశ్వనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు జిల్లా పరిషత్‌లో పరిపాలన అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన జీవీకే.మల్లిఖార్జునరావు పదోన్నతిపై ఏలూరు బదిలీపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో ఇన్‌ఛార్జ్ బాధ్యతలను ఇప్పటి వరకు వీఎస్.వేణుగోపాల్ నిర్వర్తిస్తూ వచ్చారు. శుక్రవారం ఆయన నుంచి విశ్వనాథ్ బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ ఏవో సుజాత, ఈవోఆర్‌డీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి కారుమూరి


తణుకులో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శుక్రవారం తణుకు పట్టణంలోని 5వ వార్డు సంతమార్కెట్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి కారుమూరికి ఘనస్వాగతం పలికి విశేషంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీలో సత్తాచాటిన సత్తి కృష్ణసాయి


సత్తి కృష్ణసాయి

తణుకు అర్బన్: తణుకుకు చెందిన సత్తి కృష్ణసాయి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) పరీక్షలో సత్తా చాటారు. ఇటీవల వచ్చిన ఫలితాల్లో భాగంగా జాతీయ స్థాయిలో 472వ ర్యాంకు సాధించి ఎస్ఎస్‌సీ సీజీఎల్ (స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్)లో గెజిటెటెడ్ హోదా కలిగిన అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా ఉద్యోగానికి ఎంపికయ్యారు. 590 మార్కులకుగాను 453 మార్కులు సాధించినట్లు కృష్ణసాయి తెలిపారు. భవిష్యత్తులో సివిల్స్‌లో సత్తా చాటడమే తన లక్ష్యంగా సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. తండ్రి వీరేంద్రరెడ్డి వ్యాపారికాగా, తల్లి శైలజారాణి గృహిణి అని, తమ్ముడు కౌశిక్‌రెడ్డి బీటెక్ పూర్తిచేసి ఎంఎస్‌కి వెళ్తున్నట్లు చెప్పారు.

మండుతున్న ఎండలు


ప్రత్తిపాడు వద్ద రహదారిపై వాహనాల రాకపోకలు లేక నిర్మానుష్యమైన దృశ్యం

పెంటపాడు: గత రెండు రోజుల నుంచి ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ వేసవి తీవ్రత పెరుగుతోంది. ఎండలే కాక నాలుగు రోజుల నుంచి ఉక్కపోత తయారైంది.దీంతో ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఉదయం 7 గంటలకే భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఉదయం 10 గంటలకే రోడ్లపైకి రాకపోకలు తగ్గుతున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. అధికంగా ఎండ, ఉక్కపోత వల్ల ప్రజలు అల్లాడి పోతున్నారు. ఏసీలు, ఫ్యాన్‌ల వద్ద ప్రజలు సేదదీరుతున్నారు. అత్యవసర పనులు ఉంటే మినహా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. రహదారులన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. ఎండ తీవ్రతను తట్టుకోలేక 16వ నెంబర్ జాతీయరహదారిపై ప్రయాణించే వాహనదారులు ఎండ తీవ్రత సమయంలో రోడ్లకు ఇరువైపులా చెట్ల కింద వాహనాలు నిలిపివేసి సేదదీరుతున్నారు. ఫలితంగా ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. అత్యవసర పనులపై బయటకు వచ్చేవారు ఎండ నుంచి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు వంటి రక్షణ సాధనాలను వినియోగిస్తున్నారు. ఎండ నుంచి రక్షణ పొందేందుకు వీలుగా శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా జ్యూస్ సెంటర్లు, కొబ్బరిబొండాల వ్యాపారాలు జోరుందుకున్నాయి. మరో పక్క మరో నాలుగు రోజులు ఎండలు ఇలానే ఉండబోతున్నాయని ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయనే హెచ్చరికలను వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

అఖండ అన్నసమారాధన


అత్తిలిలో కొండాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: బల్లిపాడు రోడ్డులో వేంచేసియున్న కొండాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అఖండ అన్నసమారాధన జరిపారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాట నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కారుమూరి

కొండాలమ్మ అమ్మవారిని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కోలాట భజనను వీక్షించారు. అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, తణుకు పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం


లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తపరీక్షల నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం వారి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పెరుమాళ్ళ నాగేశ్వరరావు (బదిరి) ఆర్థిక సహకారంతో శుక్రవారం కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ వారిచే ఉచిత మదుమేహ (డయాబెటిస్) రక్త పరీక్ష శిబిరం జరిగింది. 146 మందికి పరగడుపున, ఆహారం తిన్న అనంతరం రక్త పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేశారు. వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. యువత జంక్‌ఫుడ్ తీసుకోరాదని కోరారు. గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ ఈశిబిరంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణమూర్తి, సెక్రటరీ వి.రామ్మోహన్‌రావు, మెంబర్ షిప్ ఛైర్మన్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, జి.హరిబాబు, యర్రా ఆంజనేయస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): సచివాలయం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయీస్ అసోసియేషన్ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు వసంతాడ జోగేంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెం తహసిల్దార్‌కు సచివాలయం ఉద్యోగుల సమస్యలపై శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. వక్తలు మాట్లాడుతూ సాధారణ బదిలీలు, పనిగంటలు, తదితర ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ టి.దుర్గాప్రసాద్, సెక్రటరీ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూముల విలువ పెంపు



గూడెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

తాడేపల్లిగూడెం: భూముల విలువలు పెరిగాయి. గరిష్టంగా గజానికి ధర 65వేలు కాగా, కనిష్టంగా పదివేల రూపాయల వరకు పెరిగింది. తాడేపల్లిగూడెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో, పెంటపాడు రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో కలిసి ఈ పెంపు వర్తింపు గురువారం నుంచి వర్తిస్తుంది. గతంలో అనామలిస్ కమిటీల ద్వారా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను మదింపు చేసి ఈ మేరకు భూముల విలువను నిర్దేశించేవారు. ప్రస్తుతం అలా కాకుండా స్పెషల్ రివిజన్ కింద చేసిన సిఫార్సుల మేరకు భూముల విలువను నిర్ధారించి, విభజించి ఆయా దామాషాలకనుగుణంగా విలువలను పెంచారు.

20నుంచి 30 శాతం పెరుగుదల

గతంలో పెంచని భూములను గుర్తించి వాటి విలువలను 20 నుంచి 30 శాతం వరకు పెంచారు. గతంలో కనిష్ఠ విలువ గజం ఆరువేల రూపాయలు ఉండగా, ఆ విలువను ఇప్పుడు పదివేల రూపాయలకు పెంచారు. గతంలో అత్యధికంగా భూమి గజం విలువ 55 వేల రూపాయలు ఉండగా, దానిని 65 వేల రూపాయలకు పెంచారు.

విభజన : వివిధ శ్లాబుల కింద భూములను గుర్తించారు.రోడ్డుపక్క ఉన్న భూముల విలువను ఒక రకంగా, వ్యవసాయ భూములను కన్వర్షన్ చేసిన అనంతరం పెరిగిన వాటి విలువ ఆధారంగా విలువను మదింపు చేశారు. కొన్నింటిని ఇళ్ల స్థలాలుగా మారే స్థలాల పరిధిలోకి, మరికొన్నింటిని ఫిట్ ఫర్ హౌస్‌సైట్స్ కేటగిరీ కింద వర్గీకరించారు. ఈ మేరకు విలువలను నిర్ధారించారు.

విలువలు పెరిగాయిలా.

గూడెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో గతంలో గజం పదివేల రూపాయలు ఉన్న స్థలం విలువ 13వేల రూపాయలకు, 17వేలు ఉన్నభూమి విలువ 22వేలకు, 23వేలు ఉన్న భూమి విలువ 28వేలకు, 55వేల రూపాయలున్న విలువ 60 నుంచి 65వేల రూపాయలకు పెంచారు. కార్యాలయ పరిధిలో ఉన్న అనంతపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోకి వెళ్లిన గ్రామాలు మినహా మొత్తం 26 రెవిన్యూ గ్రామాల్లో తొమ్మిందింటిలో ఈ పెంపుదలను చేశారు. జాయింట్ కలెక్టర్ ఛైర్మన్‌గా, సబ్‌రిజిస్ట్రార్ కన్వీనర్‌గా, యుడా వైస్‌ఛైర్మన్ , జడ్పీ సీఈఓ , మునిసిపల్ కమిషనర్ సభ్యులుగా ఉన్న పాంచ్‌మెన్ కమిటీ సిఫార్సుల ఆధారంగానే భూముల విలువను పెంచారు. తాడేపల్లిగూడెం, తాళ్లముదునూరుపాడు, కడకట్ల, యాగర్లపల్లి, కొండ్రుపోలు, పడాల, ఆరుగొలను, కడియద్ద, ప్రత్తిపాడు రెవిన్యూ గ్రామాల్లో ఈ పెంపుదల ఉంది.